తెలుగులో చార్జిషీట్లపై చిన్న చూపు?

పోలీస్ శాఖలో మాతృభాషపై వివక్ష • ఎఫ్ఐఆర్ మొదలు చార్జిషీట్ వరకు ఇంగ్లిష్‌లోనే

ఫిర్యాదుల స్వీకరణ, విచారణ ప్రక్రియంతా తెలుగులో • ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేసి చార్జిషీట్ తయారుచేస్తున్న సిబ్బంది

అనువాద దోషాలతో కోర్టుల్లో ఇబ్బందులు • తెలుగులో ఇస్తే ఉన్నతాధికారులు తిరస్కరిస్తున్నారని ఆరోపణలు

తెలుగులో చార్జిషీట్లూ స్వీకరిస్తున్న న్యాయస్థానాలు • ప్రభుత్వం స్పందించాలని కోరుతున్న భాషాభిమానులు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఏదైనా నేరం/సంఘటన జరిగినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్లలో తెలుగులోనే ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా బాధితులను తెలుగులోనే ప్రశ్నలు అడుగుతున్నారు. సాక్షులు, ఇతర వ్యక్తుల నుంచి తెలుగులోనే సమాచారం సేకరిస్తున్నారు. నిందితులను సైతం తెలుగులోనే విచారిస్తున్నారు. కానీ, శాఖాపరంగా ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ వరకు మొత్తం ఇంగ్లిష్‌లో చేయాల్సి వస్తున్నది. విచారణ ప్రక్రియ మొత్తం మాతృభాషలోనే జరుగుతున్నా.. అంతర్గతంగా తెలుగును ఉపయోగించడంలో మాత్రం వివక్ష కొనసాగుతున్నదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చార్జిషీట్లను కేవలం ఇంగ్లిష్‌లో తయారు చేయాలన్న సంప్రదాయం కొనసాగుతున్నదని, అందుకే ఎఫ్ఐఆర్ నుంచే తెలుగును వాడటం మానేశారని భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టులు తిరస్కరించవు

పోలీస్ శాఖలో కొందరు ఉన్నతాధికారులు తెలుగులో చార్జిషీట్ దాఖలు చేస్తే తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరికి తెలుగు అర్థం కాదని, దీంతో వారు ఇంగ్లిష్‌ను ప్రోత్సహిస్తున్నారని చెప్తున్నారు. కొన్నేండ్లుగా ఇదే జరుగుతుండటంతో ఇప్పుడు ఇంగ్లిష్‌లోనే చార్జిషీట్ అనేది ఒక అనధికారిక నిబంధనగా మారిందని చెప్తున్నారు. వాస్తవానికి న్యాయస్థానాల్లో చార్జిషీట్ ఇంగ్లిష్‌లోనే వేయాలన్న నిబంధన ఏమీ లేదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. చార్జిషీట్‌ను ఇంగ్లిష్‌లో వేసినా, తెలుగులో వేసినా కోర్టులు తిరస్కరించబోవని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికీ 10-15 ఏండ్ల కిందటి కేసులు పరిశీలిస్తే తెలుగులో దాఖలు చేసిన చార్జిషీట్లు కనిపిస్తాయని చెప్తున్నారు. ప్రభుత్వాలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు



యూనిట్ ఆఫీసర్లుగా పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో తెలుగులో మాట్లాడగలరా? అర్థం చేసుకోగలరా? అని తెలుసుకునేందుకు పరీక్ష పెడతారని సమాచారం. దాని ఫలితం ఆధారంగానే పోస్టింగ్‌లు ఇస్తారని చెప్తారు. కానీ, కొన్నేండ్లుగా అధికారులు ఈ పరీక్షను పెద్దగా పట్టించుకోకుండా, ఏదో ఒక విధంగా నేరుగా పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. అందుకే వారికి స్థానిక భాషపై పట్టు ఉండటం లేదని, అందుకే ఇంగ్లిష్‌ను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

చెప్పేదొకటి.. రాసేదొకటి.. చేరేదొకటి..

చార్జిషీట్లను తెలుగులో తయారు చేయకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని భాషాభిమానులు చెప్తున్నారు. బాధితులు తెలుగులోనే తమకు జరిగిన అన్యాయాన్ని, తమ ఆవేదనను వివరిస్తారని గుర్తుచేస్తున్నారు. పోలీసులు సైతం తెలుగులోనే ఆరా తీస్తారని, సాక్షులు తెలుగులోనే సమాధానం ఇస్తారని చెప్తున్నారు. నిందితులను గుర్తించి, విచారించే క్రమంలో పోలీసులు తెలుగులోనే ప్రశ్నలు అడుగుతారని, సమాధానాలు రాబడతారని వివరిస్తున్నారు. కానీ, చార్జిషీట్‌ను ఇంగ్లీష్‌లో తయారు చేయాల్సి వస్తుండటంతో ఫిర్యాదు మొదలు సేకరించిన సమాచారం మొత్తాన్ని అనువదించాల్సి వస్తున్నదంటున్నారు. ఇది కిందిస్థాయి సిబ్బందికి, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లకు (ఎస్‌హెచ్‌వో), ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్లకు (ఐవో) పెను సవాల్‌గా మారిందని పేర్కొంటున్నారు. దీంతో చాలామంది అనువాదం కోసం ఔట్ సోర్సింగ్‌పై ఆధారపడాల్సి వస్తున్నదని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు చెప్పిందొకటి.. రాసిందొకటిగా మారిపోతున్నదని పేర్కొంటున్నారు. చివరికి న్యాయస్థానాలకు వెళ్లినప్పుడు న్యాయవాదులో, న్యాయమూర్తులో తప్పులు గుర్తిస్తున్నారని చెప్తున్నారు. ఫలితంగా కోర్టులు ఆ చార్జిషీట్లను తిరస్కరిస్తున్నాయని అంటున్నారు. దీంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందడం లేదని, వారు పోలీస్ స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని, డబ్బు, సమయం వృథా అవుతున్నాయని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకొని తెలుగులో కూడా చార్జిషీట్లు దాఖలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

చార్జిషీట్లను తెలుగులో కూడా తయారు చేసి, దాఖలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఈ మేరకు అటు పోలీసులకు, ఇటు న్యాయస్థానాలకు మార్గదర్శకాలు జారీచేయాలి. బీఎన్ఎస్ సెక్షన్ 307 ప్రకారం దిగువ కోర్టుల్లో ఏ భాషను ఉపయోగించాలో సూచించే అధికారం ప్రభుత్వానికి ఉన్నది. ఇంగ్లిష్‌లోనే చార్జిషీట్ దాఖలు చేయాలన్న ఆదేశాలతో 90 శాతం మంది పోలీస్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సమాచారాన్ని అనువాదం చేసేందుకు ఎస్‌హెచ్‌వోలు, ఐవోలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రైవేట్ టైపిస్టులపై ఆధారపడాల్సి వస్తున్నది. ఇది వారికి ఆర్థికంగా భారం కావడంతోపాటు టైపిస్టులకు న్యాయ సంబంధ పదాలు, సాంకేతిక పదాలపై పెద్దగా పట్టులేకపోవడంతో చార్జిషీట్ల తయారీ ఆలస్యమవుతున్నది. చార్జిషీట్లలో తప్పులు దొర్లుతున్నాయి. దీంతో కోర్టుల్లో తిరస్కరణకు గురవుతూ, కేసులు దీర్ఘకాలం కొనసాగుతున్నాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని తెలుగులోనూ చార్జిషీట్లు దాఖలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలి. ఇది పోలీస్ శాఖ పనితీరును పెంచడమే కాకుండా, బాధితులకు సత్వర న్యాయం అందేందుకు తోడ్పడుతుంది.

- డాక్టర్ మంగారి రాజేందర్, మాజీ డైరెక్టర్, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ

• ఆత్మీయ భరోసా కోసం మండల పరిషత్ ఎదుట ధర్నా

ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం మహిళా కూలీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. – చండ్రుగొండ

• రోడ్డెక్కిన రైతన్నలు

వేరుశనగకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో రైతులు ధర్నా చేపట్టారు. రైతులు తెచ్చిన పల్లీకి వ్యాపారులు సరైన ధర చెల్లించకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. – కల్వకుర్తి రూరల్

• పింఛన్లు పెంచండి మహాప్రభో..

పింఛన్లను పెంచండి మహాప్రభో అంటూ శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో వృద్ధులు, దివ్యాంగులు, పింఛన్‌దారులు నిరసన తెలిపారు. కడవెండి పోస్టాఫీసుకు వచ్చిన వీరంతా ప్లకార్డులతో నిరసన తెలిపారు. – దేవరుప్పుల

• రుణమాఫీ కాలేదని రైతుల నిరసన

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి యూనియన్ బ్యాంకు వద్ద గుండ్లపల్లి రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని మేనేజర్‌ను నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. –శివ్వంపేట

• విద్యుత్ శాఖలోని పోస్టులను భర్తీ చేయాలి

పవర్ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న 4 వేల పోస్టులను వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో నిరుద్యోగులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి నేటికి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్‌క్యాలెండర్ ప్రకారం అక్టోబర్‌లో విడుదల కావాల్సిన టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎంపీడీసీఎల్, టీజీ ఎస్‌పీడీసీఎల్, అసిస్టెంట్ ఇంజినీర్, సబ్ ఇంజినీర్, జూనియర్ లైన్ మెన్లకు సంబంధించి 4 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. –సుల్తాన్‌బజార్

ఎన్‌కౌంటర్లు కావు.. ఏకపక్ష దాడులు

- బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి
- రక్తపాతాన్ని ఆపేందుకు సీజ్‌ఫైర్ అమలుచేయాలి
- మావోయిస్టులతో చర్చలు జరపాలి
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లను ఖండించిన పౌర, ప్రజా సంఘాలు
- కేంద్ర తీరును ఎండగట్టిన పౌరహక్కుల నేతలు, ప్రొఫెసర్లు

శుక్రవారం ఎస్ఎస్ఎస్‌లో అపరేషన్ కగార్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, చిత్రంలో లక్ష్మణ్, జయ విందాల, బాలకిషన్, నారాయణరావు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో జరుగుతున్నవి ఎన్‌కౌంటర్లు, ఎదురుకాల్పులు కావని, ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్లు, ఏకపక్ష దాడులు అని పౌర, ప్రజాహక్కుల సంఘాల నేతలు విమర్శించారు. ఎన్‌కౌంటర్ల పేరుతో అడవుల్లో సాగిస్తున్న రక్తపాతాన్ని తక్షణం నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని, సమస్య మూలాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో తెలంగాణ పౌర హక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ, పౌరహక్కుల పరిరక్షణ కమిటీ పౌర హక్కుల పర్యవేక్షణ కమిటీ నేతలు ప్రొఫెసర్లు హరగోపాల్, గడ్డం లక్ష్మణ్, జయ విందాల, పౌరహక్కుల నేతలు బాలకిషన్, నారాయణరావు కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ సహా ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై పౌరులు, ప్రజలు, రాజకీయ పార్టీలు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలో జరుగుతున్న ఈ బలప్రయోగాన్ని ఇప్పుడు ఆమోదిస్తే, ఇది ఇంతటితో ఆగదని, ఎంతోదూరం వెళ్లే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. సమస్య మూలాల్లోకి వెళ్లకుండా, ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరపకుండా, సమస్యలకు పరిష్కారం చూపకుండా ఎన్‌కౌంటర్లు చేసుకుంటూ వెళ్తే జవాబుదారీ ఎవరని ప్రశ్నించారు.

250 మంది అమాయక గిరిజనులే..

కార్పొరేట్లకు అడవులు, ఖనిజాలను దారాదత్తం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతున్నదని, అందులో భాగంగానే మావోయిస్టులను ఏరివేస్తున్నారని ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే అజెండా, ఒకే మతం, ఒకే సిద్ధాంతం అనే నినాదంతో బీజేపీ, ఆరెస్సెస్ పనిచేస్తున్నాయని, అందులో భాగంగానే గిరిజనుల మారణహోమానికి తెగబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. 13 నెలల్లో 344ని మందిని చంపితే.. అందులో అమాయక ఆదివాసీ గిరిజనులు 250 మందికిపైగా ఉంటారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లతో చేసుకున్న 104 ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై జ్యుడిషియల్ ఎంక్వైరీ వేయాలని, ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు.

అపరేషన్ కగార్‌ను ఆపండి

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా అడవుల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని జయ విందాల కోరారు. పచ్చిన అడవుల్లో రక్తపాతాన్ని ఆపేందుకు సీజ్‌ఫైర్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించేవారిని చంపే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను చర్చలకు పిలువాలని, వారితో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి తక్షణం చర్చలు జరపాలని బాలకిషన్ కోరారు. ఐదు దశాబ్దాల పౌరహక్కుల చరిత్రలో ఎన్నడూ లేనంతగా.. మాజీ మావోయిస్టే మంత్రిగా ఉన్న ములుగు జిల్లాల్లో పౌర హక్కుల నేతల బొమ్మలు దహనం చేయడం దారుణమని నారాయణరావు మండిపడ్డారు. దేశ సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే ఎంవోయూలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి

- ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం

రవీంద్రభారతి, జనవరి 24: తెలంగాణలో 12 యూనివర్సిటీల లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని ప్రముఖ సామాజికవేత్తలు ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర యూనివర్సిటీ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 'విశ్వవిద్యాలయాల్లో విద్యాప్రమాణాలు ఒప్పంద అధ్యాపకుల పాత్ర'పై సదస్సు నిర్వహించారు. వక్తలుగా ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం పాల్గొని మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల వ్యవస్థ నెలకొందని, తక్షణమే అధ్యాపకులను క్రమబద్ధీకరించి యూజీసీ స్కేల్ ఇవ్వాలని పేర్కొన్నారు. తెలంగాణలో రోజురోజుకు విద్యాప్రమాణాలు దిగుజారుతున్నాయని వాపోయారు. ఉపేందర్, వేల్పుల కుమార్, విజయేందర్‌రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్, రేష్మారెడ్డి, కేయూ పాలక మండలి సభ్యులు చిర్ర రాజు, రాజేశ్, దత్తాత్రేయ, గంగకిషన్, స్వప్న, రజని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మూడేండ్లకోసారి బడి ఫీజుల ఖరారు

- ఐదు క్యాటగిరీలుగా ప్రైవేట్ స్కూళ్లు
- కలెక్టర్లు, రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిషన్
- సర్కారుకు నివేదిక అందజేసిన విద్యా కమిషన్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణ కోసం రెండు కమిషన్లు ఏర్పాటు చేయాలని 'తెలంగాణ విద్యాకమిషన్' ప్రతిపాదించింది. జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో, రాష్ట్రస్థాయిలో రిటైర్డ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఫీజు రెగ్యులేటరీ కమిషన్లను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రతి మూడేండ్ల బ్లాక్ పీరియడ్‌కు ఈ కమిషన్లు ఫీజులను ఖరారుచేస్తాయి. ఈ కమిషన్‌కు 'తెలంగాణ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్' అన్న పేరును ఖరారుచేసింది. ఫీజుల నియంత్రణే ధ్యేయంగా ఇంతకాలం కసరత్తు చేసిన విద్యాకమిషన్ శుక్రవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణాను కలిసిన కమిషన్ సభ్యులు ఫీజుల నియంత్రణపై రూపొందించిన నివేదికను అందజేశారు. బడులను ఇంటర్నేషనల్, కార్పొరేట్, ప్రైవేట్, బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లు, గ్రామీణ స్కూళ్లు అనే ఐదు క్యాటగిరీలుగా విభజించింది. వాటికి వేర్వేరు ఫీజులను ఖరారుచేయాలని సూచించింది. నివేదికను క్యాబినెట్ ఆమోదించిన అనంతరం అసెంబ్లీలో బిల్లు పెడతారు. ఆ తర్వాత చట్టంగా అమల్లోకి వస్తుంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేనాటికి చట్టం రూపొందించి కమిషన్లను ఏర్పాటు చేయాలన్న దిశలో విద్యాశాఖ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి.

కమిషన్ సిఫారసులివే..

- ఈ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌లో సభ్యులుగా పాఠశాల యాజమాన్యాల ప్రతినిధులు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, విద్యావేత్తలకు చోటు కల్పిస్తారు.
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పాఠశాలల ఫీజులను స్టేట్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్ ఖరారుచేస్తుంది. మిగతా జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలోని కమిషన్ ఖరారుచేస్తుంది.
- ప్రతి మూడేండ్లకోసారి పాఠశాలల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి, ఆర్థిక నివేదికను ఆడిట్ చేయించి, ఆ తర్వాత ఫీజులను సవరిస్తుంది. కనీస ఫీజును సైతం ఖరారుచేస్తుంది.
- వినియోగదారుల ధరల సూచీ, పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, ల్యాబ్‌లు, భవనాలు, టీచర్లు, సిబ్బంది వేతనాలు వంటి వివరాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ ఫీజులను ఖరారుచేస్తుంది.
- కమిషన్‌లో ఆడిటర్లు ఉంటారు. వారు అన్ని వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. కొన్ని స్కూళ్లు ఫారిన్ టీచర్లను నియమించుకున్నామని చెప్పి ఫీజులు గుంజుతున్నాయి. వీటన్నింటిని కమిషన్ పరిశీలిస్తుంది.
- కమిషన్ ఖరారుచేసిన ఫీజులనే స్కూళ్లు వసూలు చేయాలి. అంతకు మించి ఒక్క రూపాయి తీసుకోరాదు. ఆయా ఫీజులను పాఠశాల వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.
- పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు, షూస్ వంటి వాటిని విక్రయించొద్దు. ఫలానా బుక్‌స్టాల్‌లో మాత్రమే కొనాలని షరతులు విధించొద్దు.
- ట్రాన్స్‌పోర్టు విషయంలో స్కూల్ బస్సులనే వాడాలని ఒత్తిడి తీసుకురావొద్దు. ఈ విషయంలో తల్లిదండ్రులకే పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలి.
- ఫీజులపై ఫిర్యాదుల స్వీకరణకు గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఉల్లంఘించిన స్కూళ్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

విద్యార్థుల భద్రతపై రవాణాశాఖ నజర్

- రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు
- 30 జిల్లాల్లో 50 పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా రహదారుల ప్రమాదాల నియంత్రణపై రవాణాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. తొలిదశలో 30 జిల్లాల్లోని 50 పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటుచేయాలని నిర్ణయించి, తొలి పార్కును నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రారంభించింది. యూనిసెఫ్ సహకారంతో వీటిని ఏర్పాటుచేయనున్నట్టు, ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల్లో నేలపై ఫ్లోరింగ్ చేసి జీబ్రా లైన్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేసి ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తామని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.

ప్రమాదాల్లో టాప్‌టెన్‌లో తెలంగాణ..

రహదారి ప్రమాదాల్లో తెలంగాణ టాప్‌టెన్‌లో ఉన్నట్టు రవాణాశాఖ వెల్లడించింది. 2023లో 21,619 ప్రమాదాలు జరగ్గా 7,600 మంది మరణించారు. వీరిలో 1,415 మంది పాతికేళ్లలోపు వారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేవారే ఎక్కువగా ఉన్నట్టు రవాణాశాఖ వెల్లడించింది.

డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను నేరుగా భర్తీ చేయాలని ఓయూలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య

డిప్యూటీ సర్వేయర్లను నేరుగా భర్తీ చేయాలి

ఓయూలో విద్యార్థులతో కలిసి ఆర్ కృష్ణయ్య ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగాలను వీఆర్‌వో, వీఆర్‌ఏల ద్వారా కాకుండా బీటెక్, డిప్లొమా, ఐటీఐ సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులతోనే నింపాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేనివారితో ఆయా ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. అలా చేస్తే భూ సర్వేలో తప్పులు జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

యాదగిరిగుట్ట ఆలయంపై కమ్ముకున్న మంచు

రాష్ట్రంలో కొనసాగుతున్న పొగమంచు

పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తేతెలంగాణ): రాష్ట్రాన్ని శుక్రవారం కూడా పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలకూ పొగమంచు ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు రాష్ట్రంలో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం, రాత్రి తీవ్రమైన చలి, మధ్యాహ్నం ఎండ ఉంటున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 9.9 డిగ్రీల నుంచి 16.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరత్న తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణాన్ని మంచు కమ్మేసింది. లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంపై మంచు దుప్పటి పరుచుకున్నది.